


# పొదుపు

వి. రంగరాజు

'ఒరేయ్ అక్కు పక్షీ!' అని వినపడగానే వెనక్కి తిరిగి చూశాడు రాంబాబు. ఎదురుగా తన తండ్రి నిలబడి వున్నాడు. 'ఏమిటన్నట్లు?' కళ్ళెగరేశాడు.

'అప్రాచ్యపు వెధవా!' అలా పేస్ట్‌ని టేస్ట్‌గా వుంది కదా అని కిలోల లెక్కన ఆ దిక్కుమాలిన బ్రష్‌కి రాసి వేస్ట్ చేస్తున్నావేమిట్రా బడుద్దాయ్!' సింగరేణి బొగ్గుగనుల్లా వున్న నీ దంతాలని ఎన్ని టన్నుల పేస్టుతో తోమినా లాభం లేదోయ్!! "వృధా చేయకుండా త్వరగా కాఫీకి తగలడు!" అంటూ తండ్రి ప్రొద్దున్నే సుప్రభాతం ఆలపించాడు.

తన తండ్రి అత్యంత దుబారా మనిషి. ఎక్కడైనా హోటల్‌లో టిఫిన్ బిల్ పది రూపాయలైతే టిప్ క్రింద యిరవై రూపాయలు యిస్తాడు. 'అలాంటిది పేస్ట్‌ని వేస్ట్ చేయవద్దని తననే తిట్టాడే?' అని రాంబాబు ఆశ్చర్యపోయి 'ప్చ్' అనుకున్నాడు.

కిచెన్ లోనికి వెళ్ళగానే తల్లి కాఫీ అందించింది. సిప్ చేసిన తర్వాత 'యాక్! తూ' అంటే వాంతి చేసుకోబోయాడు.

'యిది కాఫీయా? కషాయమా?'

'కాఫీలో అసలు చక్కెర వేయనే లేదు. అందుకే అలా డికాక్షన్‌లా తగలడింది' సర్ది చెప్పింది తల్లి.

అతి కష్టం మీద కాఫీ త్రాగటం పూర్తి చేశాడు.

'ఇంట్లో పంచదార నిండు కుందా?' అడిగాడు రాంబాబు.

'షుగర్ ఫ్యాకర్టీలో కూడా అంత స్టాకుండదు!'

'మరి! కాఫీలో వేసి చావలేదేం?" అరిచాడు రాంబాబు. తల్లి మౌనంగా రాంబాబుకేసి చూసింది.

టవల్ తీసుకొని బాత్‌రూంలోనికి ప్రవేశించాడు రాంబాబు. బాత్‌రూంలో సోప్ లేకపోవడంతో కోపం నషాళానికి అంటింది. 'లతా' అని బిగ్గరగా శ్రీమతిని కేక వేశాడు. 'ఏమిటండీ! అలా రేప్‌కి గురైన మహిళలా అరుస్తారు? ఏం కావాలి?" అన్నది.

'బాత్ రూంలో సోప్ పెట్టలేదేం?' రాంబాబు అరిచాడు.

'యీసారికి అక్కడున్న కొబ్బరి పీచుతో తోముకోండి. వారం తర్వాత సోప్ కొంటాను' అని లత తన మొగుణ్ణి బాత్ రూం లోపలికి నెట్టింది.

'ఏం? వూళ్ళో సోప్‌లకి ఏమైనా కరువా?'

"ఏం లేదండీ! ఒక్క వారం రోజులు ఓపిక పట్టండి!" రోజుకో సోప్‌ని అరగదీసే పెళ్ళాం మాటలకి రాంబాబుకి ఆశ్చర్యపోవడానికి కూడా నోరు పెగలలేదు.

ఎలాగో స్నానం పూర్తి చేశాడు. టిఫిన్ తిందామని టేబుల్ దగ్గర కూర్చున్నాడు. తల్లి వచ్చి ప్లేట్‌లో టిఫిన్ వుంచి ప్రక్కనే భూతద్దం పెట్టింది. రాంబాబు "యిదెందుకూ?" అని భూతద్దాన్ని తల్లికి చూపించి అడిగాడు.

"ఎందుకేమిట్రా? నీం బొంద!! టిఫిన్ ప్లేట్లో కనబడవద్దూ!" అని రాంబాబు తల్లి దీర్ఘాలు తీసింది.

ఆవాలు లాగా వున్న గారెల్ని తిని టిఫిన్ పూర్తి చేశాడు. తరువాత ఆఫీస్ కోసం కొనుక్కున్న స్కూటర్‌ని స్టార్ట్ చేద్దామని బైటకు వచ్చి చూశాడు. బైట వుంచిన స్కూటర్ కాస్తా మాయమైంది. రాంబాబు తండ్రి వచ్చి బస్ టికెట్లకు డబ్బు లిచ్చి కొడుకుని సాగనంపాడు. పెట్రోల్‌ని పొదుపు చేశాడు.

తను మోపెడ్ కొనిమ్మంటే ఏకంగా స్కూటర్‌నే కొనిచ్చిన తండ్రి, యీ రోజు స్కూటర్‌ని దాచిపెట్టి బస్ టికెట్లకి డబ్బులిస్తూంటే రాంబాబుకి అయోమయంగా వుంది.

'ఏమిటో? యీ రోజు యింట్లో వాళ్ళందరూ విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు' రాంబాబు విసుక్కొని, ఆ కోపాన్ని బస్ కండక్టర్ మీద చూపాడు. రణగొణధ్వనుల మధ్య సాగిన బస్ ప్రయాణం ఆఫీస్ దగ్గర అంతమైంది.

ఆఫీస్‌లోనికి అడుగుపెట్టగానే ఎదురుగా తన స్టెనో మాలిని కన్పించింది. ఎప్పుడూ నిండుగా చీర కట్టుకొని వుండే మాలిని వంటి మీద వున్న స్కర్ట్‌ని, మిడ్డీని చూడగానే రాంబాబు వయసు తగ్గసాగింది.

"హాయ్! ఏమిటి? క్రొత్తగా కన్పిస్తున్నావ్?" మాలిని ఒంపు సొంపుల్ని చూస్తూ రాంబాబు అడిగాడు. "యూ! నాట్ జస్ట్ ఫర్ ఛేంజ్" సుతారంగా కన్నుగీటి, రాంబాబుకి కిస్ యిచ్చి తన బాస్ గదిలోకి వెళ్ళిపోయింది మాలిని.

తర్వాత రాంబాబుకి తన కొలీగ్ వినోద్ కన్పించాడు. బోర్డు మీద బాగా నలిగి పోయిన కాగితాల నుంచి రఫ్‌స్కెచ్ గీసుకుంటున్న వినోద్‌ని చూసి, "ఏమిటోయ్? కాగితాలకి కరువా? లేక కలప పరిశ్రమలన్నీ మూత పడ్డాయా?" అని ఘాటుగా ప్రశ్నించాడు.

వినోద్ చిరునవ్వుతో రాంబాబుని చూచి, 'కాగితాలని వేస్ట్ చేయకూడదోయ్!' అన్నాడు.

ఒక స్కెచ్ గీయడానికి రీము కాగితాలు వృధా చేసే తన కొలీగ్ వినోద్ యిలా పనికిమాలిన చెత్తకాగితాన్ని వాడుతుంటే రాంబాబుకి అంతా గందరగోళంగా వుంది.

రాంబాబు తన సీట్లో కూర్చొని పని చేసుకోసాగాడు. యింతలో బాస్ గదిలోపల అరుపులు, కేకలు విన్పించాయి. "ఎవరికో యీ రోజు మూడింది!" అని గొణుక్కున్నాడు రాంబాబు.

ఇంతలో బాస్ గదిలోంచి జేవురించి పీక్కుపోయిన ముఖంతో బైటపడ్డాడు ప్రసాద్.

ప్రసాద్ ఆఫీసులో ఎల్.డి.సిగా చేరాడు. బైట పనులన్నీ చాక చక్యంగా పూర్తి చేసి త్వరగా బాస్ యింప్రెషన్‌ని కొట్టేశాడు. ప్రసాద్ చేయలేని పనంటూ ఏదీ లేదని ఆఫీస్‌లో అందరూ అనుకుంటారు.

'ఏం జరిగింది ప్రసాద్?' అనునయంగా తన దగ్గరున్న సీటులోకి వచ్చి కూర్చున్న ప్రసాద్‌ని రాంబాబు అడిగాడు. 'ఏం లేదు? ఎప్పుడూ బాస్ నేను ఎంత డబ్బు అడిగితే దానికి రెట్టింపు యిస్తారు. అసలు నన్ను లెక్కలు చూపించమని కూడా అడగరు.'

'మరిప్పుడేమైంది?' చిరాకుగా అడిగాడు రాంబాబు.

'ఏముందీ? సింహాచలం వెళ్ళి మన గోడౌన్‌లో స్టాకు ఎంత వుందో చూచి రమ్మని రెండు వందలు యిచ్చారు. నేను మరో వంద రూపాయలు అడిగాను. అంతే! బాస్ గయ్యిమని అరిచి నా చేతిలోంచి రెండు వందలూ లాక్కొని యాభై రూపాయల నోటు నా మొఖాన గిరాటేశారు" వెక్కుతూ అన్నాడు ప్రసాద్.

'గాజువాక నించి భీముని పట్నం పోవడానికే యాభై రూ॥లు చాలవు. సింహాచలం వెళ్ళి రావడానికి యాభై రూపాయలిచ్చారు బాస్. ఏమిటో ప్రొద్దుటి నించి అన్నీ వింతలూ! విశేషాలూ!!' రాంబాబు తన సీటుకి అనుకొని ఆలోచిస్తున్నాడు.

సాయంత్రం ఆరుకాగానే ఆఫీసు మూసేశారు. అందరూ ఎవరి యిష్ట ప్రకారం వారి వారి గమ్యాలకి బయలుదేరారు. రాంబాబు తన యింటి వైపుకి వెళ్ళే బస్ కోసం ఎదురు చూస్తున్నాడు. ప్రక్కనే వచ్చి నిలబడి రాంబాబు భుజం తట్టాడు ప్రకాష్. 'పదవోయ్! అలా కూరగాయల మార్కెట్‌కి వెళ్దాం. తర్వాత నిన్ను యింటి దగ్గర డ్రాప్ చేస్తాలే!" అని రాంబాబుని ప్రకాష్ స్కూటర్ ఎక్కించుకున్నాడు.

ఇద్దరూ కూరగాయల మార్కెట్ దగ్గర ఆగారు. ప్రకాష్ బేరమాడుతూంటే రాంబాబు ఆసక్తిగా తిలకించ సాగాడు.

'వంకాయలు కిలో ఎంత?'

"రెండు రూపాయలకిస్తావా?'

'అబ్బే! గిట్టదండీ - ఐదు రూపాయలేసుకోండి!'

'సర్లే! ఆ టమోటాలు కేజీ ఎంత?'

'అది కూడా కే.జీ ఐదు రూపాయలండీ!'

'రెండు రూపాయలకిస్తా! రెండు కే.జీలు యివ్వు!'

'ఓర్నాయనో! ఓపని చేయండి! యీ త్రాసు, తూనిక రాళ్ళేసుకొని యిక్కడే కూరలమ్ముకోండి' అంటూ రాంబాబు, ప్రకాష్‌ల వైపు తిరస్కారంగా చూశాడు.

రాత్రి ఎనిమిది గంటలకి యిల్లు చేరాడు రాంబాబు. గదుల్లో క్రొవ్వొత్తులు వెలుగుతున్నాయి. ఫ్యాన్లు, టి.వి, రేడియో, ఫ్రిజ్‌లు అన్నీ సైలెంట్‌గా వున్నాయి. ఇల్లంతా శ్మశాన నిశ్శబ్దం ఆవరించుకొని వుంది.

'కరెంట్ పోయిందా?' అని రాంబాబు అడిగాడు.

'లేదురా! నిక్షేపంగా వుంది'

'మరి! లైట్లు, ఫ్యాన్లు పనిచేయవా?' చిరాకుగా శ్రీమతి వైపు తిరిగి అన్నాడు రాంబాబు.

'ఎక్కడా ఎలాంటి లోపమూ లేదు. అన్నీ బాగానే వున్నాయి. రాష్ట్రమంతా సుభిక్షంగా వుంది'

'అయితే! యీ చీకటిలో, వుక్క పోస్తుంటే అందరూ క్రొవ్వొత్తులతో కాలక్షేపం చేస్తున్నారేం?' రాంబాబు అందర్నీ వుద్దేశించి అడిగాడు.

ఇంతలో ప్రక్కింటి పాపారావు చేతిలో లాంతరు, న్యూస్ పేపర్‌లతో రాంబాబు ఎదురుగా ప్రత్యక్షమయ్యాడు. రాంబాబు 'ఏమిటన్నట్లు?' చూశాడు.

పాపారావు లాంతరు వెలుగులో న్యూస్ పేపర్‌లోని హెడ్డింగ్‌ని రాంబాబుకి చదివి విన్పించాడు.

'రాష్ట్రంలో పొదుపు వారోత్సవం' మిగిలిన న్యూస్‌ని రాంబాబు చదువ సాగాడు.

'రాష్ట్ర ప్రభుత్వం వారం రోజులపాటు 'పొదుపు వారోత్సవం' నిర్వహిస్తోంది రాష్ట్రప్రజలందరూ సహకరించాలని గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం శుభాకాంక్షలు తెల్పింది.'

పత్రికలో వచ్చిన వార్తలను చదివి రాంబాబు కుర్చీలో కూలబడిపోయాడు. ❋

## జాక్‌పాట్ గెలిచిన బాషా

పాపులర్ ఆన్‌లైన్‌గేమ్ 'ఫ్రేలోట్టో.కామ్' కంప్యూటర్ ద్వారా ఆడి పదిమిలియన్ డాలర్ల జాక్‌పాట్‌ను గెలిచాడు మహమ్మద్ కరీమ్ బాషా. అయితే ఈ సొమ్ము ఏడాదికి కొంత చొప్పున 30 సంవత్సరాలపాటు ఇన్‌స్టాల్ మెంట్స్‌గా అతనికి అందుతుందట.

